విశ్వంభర V3 NEWS

(మొదటి పేజీ తరువాయి)

# పెళ్లి చేసుకుంటానని మోసం...

కానీ అది నిరూపించాల్సిన బాధ్యత బాధితులకే ఉంటుందని స్పష్టం చేసింది. స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పుడే దానిని నేరంగా పరిగణిస్తారని పేర్కొంది. హైదరాబాద్ కర్నన్ ఘాట్కు చెందిన రాజాపురం జీవన్ రెడ్డి దాఖలు చేసిన పటిషన్ పై విచారణలో కోర్టు ఈ తీర్పు ఇచ్చింది. 2019లో కరకల్ల పద్మిని రెడ్డి అనే యువతి జీవన్ రెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు రద్దు చేయాలని జీవన్ రెడ్డి కోర్టును ఆశ్రయించడంతో ఈ తీర్పును ఇచ్చింది. జీవన్ రెడ్డి తన పేరెంట్స్ ను ఒప్పించి పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో జీవన్ రెడ్డిపై పోలీసులు నేరపూరిత కేసు నమోదు చేయడంతో ఆ కేసును రద్దు చేయాలని తీర్పునిస్తూ విచారణ కోసం వాయిదా వేసింది.

# బోనమెత్తిన గోల్కొండ..

శాఖ కమిషనర్ ఎస్. వెంకట్రావు ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేస్తూ, అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ట్రాఫిక్, నీటి వసతి, వైద్య శిబిరాలు, శుభ్రత చర్యలు అన్ని విభాగాల్లో సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. హెచ్ఎండిఏ ఏర్పాటు చేసిన తాగునీటి స్టాల్స్, మెడికల్ క్యాంపులు పరిశీలించిన ఆయన, వీటిని మరింత మెరుగుపరిచేందుకు ఆదేశాలు ఇచ్చారు. వెచ్చటి ఆదివారం కావడం తో పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించు కోవడానికి తరలివచ్చారు. కోటపై అధిక భక్తుల రద్దీ నేపథ్యంలో పోలీస్ శాఖ పటిష్ట చర్యలు తీసుకుంది. జూబ్లీహిల్స్ పోలీస్ కంట్రోల్ రూమ్ ద్వారా జాతరను నిరంతరం నిఘా ఉంచుతు న్నారు. భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టారు. జాతరకు హాజరైన అధికారులు.. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ హరిచందన దాసరి, సీపీ సీవీ ఆనంద్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు.. అన్ని ఏర్పాట్లను సమీక్షించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. విదేశీ భక్తుల సైతం పాల్గొ నడం ఈ ఏడాది జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పీస్ కమిటీ సభ్యులు, పోలీస్ పాయి ంట్లు, అంబులెన్సులు, మెడికల్ క్యాంపులు, నీటి సదుపాయాలు, పారిశుద్ధ్య కార్యకలాపాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి.

# గోదావరి-బనకచర్లపై రేపు పీపీటీ

- మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించేందుకు నిర్ణయం
- ఈ ప్రాజెక్టు నిర్మించడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలకు జరిగే నష్టాన్ని వివరించేందుకు ఏర్పాట్లు



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గోదావరి-బనకచర్లపై మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించాలని నిర్ణయించింది. రాష్ట్ర ప్రజాప్రతినిధులందరికీ నిజనిజాలు తెలిపేలా ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. అందుకు అనుగుణంగా ఆయన నీటిపారుదల రంగ అధికారులతో ప్రత్యేక సమీక్షలు నిర్వహించి ఈ ప్రాజెక్టు నిర్మించడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలు ఏ రకంగా దెబ్బతింటాయో సమగ్రంగా వివరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డాక్టర్ జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో మద్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్న ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ముఖ్యఅతిథులుగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో సహా రాష్ట్ర మంత్రివర్గం మొత్తం హాజరుకానుంది. అంతేకాకుండా రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు, శాసన మండలి, శాసనసభ్యులతోపాటు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, వివిధ విభాగాలకు చెందిన కమిషన్ల చైర్మన్లు, సభ్యులు పాల్గొననున్నారు.

# ట్రకోమా రహిత దేశంగా భారత్

లక్షల మంది పాల్గొన్నారన్నారు. దాదాపు 10 ఏళ్ల క్రితం మొదలైన ఈ కార్యక్రమం ఏటేట మరింత విస్తరిస్తోందన్నారు. చాలా మంది ప్రజలు యోగాను తమ జీవితంలో భాగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. దేశంలో ఎమర్జెన్సీ విధించిన వారు రాజ్యాంగాన్ని హత్య చేయడంతోపాటు.. న్యాయ విభాగాన్ని బానిసగా మార్చుకోవాలనుకున్నారని మోదీ తెలిపారు. నాడు జార్జిఫెర్నాండెజ్‌ను సంకెళ్లతో బంధించారన్నారు. కానీ, భారత ప్రజలు శక్తిమంతమైన వారు కావడంతో.. ఎమర్జెన్సీ తొలగిపోయిందని చెప్పారు. దానిని విధించినవారు ఓడిపోయారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మొరార్జీ దేశాయ్, వాజ్‌పేయి, బాబూ జగ్జీవన్ రామ్ వంటి నేతల ప్రసంగాలను మోడీ వినిపించారు. ఎమర్జెన్సీపై పోరాడిన వారిని కచ్చితంగా గుర్తుపెట్టుకోవాలన్నారు. ఫుట్‌బాల్ ఆటగాళ్లకు కేంద్రంగా బోడోల్యాండ్ మారిందని అభినందించారు. పరిమిత వనరులతోనే సాధన చేసి అద్భుతంగా రాణిస్తున్నారన్నారు. దేశంలోని చిన్నారులకు వీరు ఆదర్శంగా మారారని కొనియాడారు. ఫిట్‌నెస్, ఊబకాయం తగ్గించుకోవడానికి ఆహారంలో నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించుకోవాని సూచించారు. మేఘాలయ ఎరీసిల్క్‌కు జీఐ ట్యాగ్ లభించిందని అభినందించారు. పురుగులను చంపకుండా వస్త్రాన్ని తయారు చేయడం దీని ప్రత్యేకతన్నారు. ఇక తెలంగాణ భద్రాచలంలోని ఆదివాసి మహిళలు 'భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్' పేరిట బిస్కెట్లు తయారు చేస్తున్నారని.. అవి హైదరాబాద్ నుంచి లండన్‌కు కూడా ఎగుమతి అవుతున్నాయని వెల్లడించారు. ఈ మహిళలే మూడు నెలల్లో 40,000 శానిటరీ నాప్కిన్లను తయారు చేసి విక్రయించారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లాలో బౌద్ధక్షేత్రాలకు విదేశాల్లో అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. అందరూ తమ ప్రాంతాల్లోని బౌద్ధ క్షేత్రాలను ఒక్కసారైనా సందర్శించాలన్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న శుభాంశు శుక్లాకు అభినందనలు తెలిపారు.

# త్రిభాషా విధానంపై వెనక్కి తగ్గిన మహారాష్ట్ర సర్కారు

ఎలా అమలు చేయాలనే దానిపై విద్యావేత్త నరేంద్ర జాదవ్ నేతృత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం దేవేంద్ర ఫడణవీస్ ప్రకటించారు. "ఒకటో తరగతి నుంచి త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడానికి సంబంధించి ఏప్రిల్, జూన్‌లలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ విధానం అమలుపై సిఫార్సులు చేసేందుకు డా.నరేంద్ర జాదవ్ నేతృత్వంలో ఒక కమిటీ ఏర్పాటు చేస్తున్నాం" అని ముంబయిలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం ఫడణవీస్ తెలిపారు. 1 నుంచి 12వ తరగతి వరకు ఈ విధానాన్ని ప్రవేశపెట్టాలని డా.రఘునాథ్ మషేల్కర్ కమిటీ చేసిన సిఫార్సులను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉద్ధవ్ ఠాక్రే అంగీకరించారని, దాని అమలుపై ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు, ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. ఈ విధానాన్ని తమిళనాడు ప్రభుత్వం ఇప్పటికే తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే స్పష్టం చేస్తోంది. ఈ క్రమంలోనే.. ఇంగ్లీష్, మరాఠీ మీడియం పాఠశాలల్లో చదువుతున్న 1-5 తరగతుల విద్యార్థులకు హిందీని మూడో భాషగా తప్పనిసరి చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం తొలుత ఏప్రిల్ 16న ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో.. హిందీని ఆప్షనల్‌గా మారుస్తూ సవరణ ఉత్తర్వు జారీ చేసింది. అయినా.. ప్రతిపక్షాల నుంచి పెద్దఎత్తున విమర్శలు కొనసాగాయి. ఈ క్రమంలో ప్రభుత్వంపై పోరాడేందుకు శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, 'మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన' (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రేలు ఏకం కానున్నారనే చర్చ మొదలైంది. ఈ పరిణామాల నడుమ రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. దీంతో వచ్చే నెల 5న శివసేన యూబీటీ, ఎంఎన్ఎస్‌ల ఆధ్వర్యంలో నిర్వహించాలనుకున్న నిరసనను రద్దు చేస్తున్నట్లు సంజయ్ రౌత్ ప్రకటించారు.

# తెలంగాణలోనూ

(మొదటి పేజీ తరువాయి)

లొంగిపోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. నిజామబాద్‌లో పాలిటెక్నిక్ మైదానంలో ఏర్పాటు చేసిన రైతు సమ్మేళన సభలో ఆయన ప్రసంగించారు. "పహల్గాంలో ఉగ్రదాడితో పాకిస్థాన్ మనల్ని భయపెట్టాలని చూసింది. ఆ తర్వాత భారత్ శక్తి ఏమిటో పాకిస్థాన్‌కు, ప్రపంచానికి తెలిసింది. ఉగ్రవాదాన్ని మాత్రమే కాదు.. దేశంలోని నక్సలిజం కూడా లేకుండా చేయాలన్నదే మోడీ లక్ష్యం. నక్సలిజాన్ని తుదముట్టించాలా లేదా? మీరే చెప్పండి. 2026 మార్చి 30 లోపు దేశంలో నక్సలిజం లేకుండా చేస్తాం. నక్సలైట్లు తక్షణమే హత్యాకాండ ఆపేసి లొంగిపోవాలి. నక్సలైట్లు త్వరగా జనజీవన స్రవంతిలోకి రావాలి. ఇప్పటికే 10వేల మంది నక్సలైట్లు లొంగిపోయారు.. జన జీవన స్రవంతిలోకి వచ్చేశారు.

**తెలంగాణలోనూ అధికారంలోకి వస్తాం..**

తెలంగాణలో బీజేపీ తప్పక అధికారంలోకి వస్తుంది. కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే బీజేపీ విజయం ఖాయమైందని తెలుస్తోందన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఎంపీ అర్వింద్ నిజామాబాద్‌కు పసుపుబోర్డు సాధించారు. పసుపుబోర్డు ప్రధాన కార్యాలయాన్ని కూడా నిజామాబాద్‌లోనే ఏర్పాటు చేస్తున్నాం. మోడీ ఏదైనా చెప్పారంటే అది తప్పకుండా చేసి చూపిస్తారు. నిజామాబాద్ రైతులు పసుపుబోర్డు కోసం 40 ఏళ్ల పాటు పోరాటం చేశారు. నిజామాబాద్ రైతులు పండించిన పసుపు భవిష్యత్‌లో ప్రపంచమంతా ఎగుమతి అవుతుంది. పసుపుబోర్డు కార్యాలయం ఏర్పాటుతో స్థానిక రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలగనున్నాయి. భారత్ ఆర్గానిక్ లిమిటెడ్, భారత్ ఎక్స్‌పోర్టు లిమిటెడ్ కూడా నిజామాబాద్‌లోనే ఏర్పాటవుతున్నాయి. భారత్ ఎక్స్‌పోర్టు లిమిటెడ్‌తో నిజామాబాద్ పసుపు అమెరికా, యూరప్‌కు ఎగుమతి అవుతుంది.

భారాస సర్కార్ అవినీతికి పాల్పడిందా? లేదా? ధరణి పోర్టల్, కాళేశ్వరం.. ఇలా అనేక అంశాల్లో భారాస ప్రభుత్వం అవినీతికి పాల్పడింది. కాంగ్రెస్ పార్టీ తెలంగాణను దిల్లీకి ఏటీఎంగా మార్చేసింది. తెలంగాణలో భారాస పోయింది.. కానీ, అవినీతి పోలేదు" అని అమిత్ షా అన్నారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ధర్మపురి అర్వింద్, లక్ష్మణ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు సభలో పాల్గొన్నారు.

# పూరీలో తొక్కిసలాట ఘటన..

జిల్లా కలెక్టర్ సిద్ధార్థ శంకర్ స్వైన్ , పూరీ పోలీస్ సూపరింటెండెంట్ వినిత్ అగర్వాల్ లను బదిలీ చేస్తూ..ఉత్తర్వులు జారీ చేసింది. ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు. ఖుర్దా కలెక్టర్ చంచల్ రాణా నూతన జిల్లా మేజిస్ట్రేట్‌గా బాధ్యతలు స్వీకరిస్తారని.. ప్రస్తుతం ఏడీజీ (క్రైమ్)గా ఉన్న సీనియర్ పోలీసు అధికారి పినాక్ మిశ్రా ఎస్పీగా విధుల్లో చేరతారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున 4.20 గంటల సమయంలో రథాలపై ఉన్న దేవతలను చూడటానికి గుండిచా ఆలయం వద్దకు భక్తులు భారీగా చేరుకోవడంతో తొక్కిసలాట నెలకొంది. ఈ ఘటనలో ముగ్గురు భక్తులు ప్రాణాలు కోల్పోగా..పలువురు గాయపడ్డారు. అధికారులు తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే తొక్కిసలాట నెలకొందని భక్తులు ఆరోపించారు. రద్దీకి అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు చేయలేదని.. అంబులెన్సులు కూడా అందుబాటులో ఉంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలమంది భక్తులు రథయాత్రకు వస్తారని తెలిసినా అధికారులు సరైన ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. ఈ ఘటనపై ఒడిశా సీఎం మోహన్ చరణ్ స్పందించారు. ప్రభుత్వం తరఫున క్షమాపణలు భక్తులను క్షమాపణలు కోరారు. భద్రతా వైఫల్యంపై దర్యాప్తునకు ఐదుగురు సభ్యులతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రథయాత్ర ముగిసే వరకు ఎటువంటి అసాధారణ ఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

# 'మేకిన్ ఇండియా' కాదు.. 'ఇన్వెంట్ ఇన్ తెలంగాణ'

2.9 శాతంగా ఉందని, అదే జాతీయ సగటు 0.52 శాతం మాత్రమే ఉందని శ్రీధర్?బాబు వెల్లడించారు. ఇలా ఆరు రేట్లు తెలంగాణలో అధికంగా నమోదయ్యిందని 2024-25లో ఇండస్ట్రియల్ గ్రాస్ స్టేట్ వాల్యూ యాడెడ్ (జీఎస్ వీఏ) రూ.2.77 లక్షలకు చేరిందని తెలిపారు. ఇంధన వినియోగంలో 15.6 శాతం, జీఎస్టీ వసూళ్లలో 9.8 శాతం, పే రోల్ ఎన్ రోల్ మెంట్స్ లో 13.9 శాతం వృద్ధి రేటు నమోదయ్యిందని ఈ సందర్భంగా వివరించారు.

**ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ కేంద్రంగా ప్రత్యేక జోన్లు**

'తెలంగాణ నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయంటూ కొందరూ విష ప్రచారం చేస్తున్నారు. ఏడాదిన్నర కాలంలోనే రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తెలంగాణకు తీసుకొచ్చాం. ఒక్క లైఫ్ సైన్సెస్ రంగంలోనే రూ.40వేల కోట్ల పెట్టుబడులొచ్చాయి. కొత్తగా 150 కొత్త ప్రాజెక్టులు మొదలయ్యాయి. 51వేల మంది ప్రత్యక్షంగాను , మరో 1.5 లక్షల మందికి పరోక్షంగాను ఉపాధి అవకాశాలు లభించాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, లైఫ్ సైన్సెస్ సిటీ, గ్రీన్ ఇండస్ట్రియల్ కారిడార్స్ ను అభివృద్ధి చేస్తున్నాం. పారిశ్రామికాభివృద్ధి వికేంద్రీకరణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాం. అవుటర్ రింగ్ రోడ్డు లోపల టెక్నాలజీ, సర్వీసెస్ జోన్, అలాగే ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య మ్యానుఫాక్చరింగ్ జోన్, ఆర్ఆర్ఆర్ బయట వ్యవసాయ, గ్రామీణ ఇన్నోవేషన్ జోన్ ను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నాం' అని మంత్రి శ్రీధర్?బాబు అన్నారు. తాము అయిదేళ్ల కోసం ప్రణాళికలు రూపొందించడం లేదని, రాబోయే తరాల కోసం ఆలోచి స్తున్నామని అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2035 నాటికి ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన పునరుద్ఘాటించారు. ఆ దిశగానే అడుగులు వేస్తున్నామని, తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్య సాధనలో భాగస్వామ్యమయ్యేందుకు ముందుకొచ్చిన టోనీ బ్లెయిర్ ఇన్స్టిట్యూట్ కు ధన్యవాదాలు తెలుపుతున్నామని వెల్లడించారు. ఇలా రాష్ట్రాభివృద్ధిలో కలిసొచ్చే వారందర్నీ కలుపుకుని ముందుకెళ్తామన్నారు.

**జీఎస్డీపీలో ఎంఎస్ఎంఈల వాటా 10 శాతానికి పెరిగేలా..**

'దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ(ఎంఎస్ఎంఈ)ల బలోపేతంపై తమ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని శ్రీధర్?బాబు అన్నారు. గత 18 నెలల్లో కొత్తగా 15వేల ఎంఎస్ఎంఈలు ప్రారంభమయ్యాయని తెలిపారు. మన జీఎస్ డీపీలో ఎంఎస్ ఎంఈల వాటాను 10 శాతానికి పెంచేలానే సంకల్పంతో గతేడాది ప్రత్యేక పాలసీకి రూపకల్పన చేశామని ఆయన వెల్లడించారు. ప్రతి జిల్లా కేంద్రాల్లోనూ ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేస్తున్నామని, వీటిల్లో మహిళలు, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రాధాన్యం ఇస్తామని మంత్రి శ్రీధర్?బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ టీసీసీఐ అధ్యక్షుడు డా.సురేష్ కుమార్ సింఘాల్, సీనియర్ ఉపాధ్యక్షుడు ఆర్. రవి కుమార్, ఉపాధ్యక్షుడు కేకే మహేశ్వరి, ఐఐటీఈఎక్స్ 2025 కన్వీనర్ విమలేష్ గుప్తా పాల్గొన్నారు.

# ఏపిలో కలిపిన నాలుగు పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలి

**యాటపాక, కన్నాయిగూడం, పిచుకలపాడు, పురుషోత్తపట్నం ప్రజలకు ఇబ్బందులు**

**2014 చట్ట ప్రకారం తగిన చట్టపరమైన, పరిపాలనా చర్యలు తీసుకోవాలి**

**కేంద్ర మంత్రి అమిత్‌షాను లేఖ ద్వారా కోరిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల**



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** ఏపిలోని కలిపిన నాలుగు గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలని కేంద్ర మంత్రి అమిత్?షా ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కోరారు. ఆదివారం నిజామాబాద్?లో పసుపు బోర్డు ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆయనను కలిసి విలీనం గ్రామాల సమస్యలను వివరించి లేఖ అందజేశారు. ఈసందర్భంగా పేర్కొంటూ ఏపి పునర్విభజన చట్టం 2014 లో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో కలిసిన భద్రాచలం చుట్టుపక్క గ్రామాలైన యాటపాక, కన్నాయిగూడం, పిచుకలపాడు, పురుషోత్తపట్నం లను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని వినవించారు. భద్రాచలం పట్టణం తెలంగాణలో కొనసాగుతుండగా, నాలుగు గ్రామ పంచాయతీలు విభజనలో భాగంగా ఏపీలో కలిపారని, వీటితో అనేక పరిపాలనా, అభివృద్ధి ఇబ్బందులు సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాచలం పట్టణం తెలంగాణ ప్రధాన మండలాల మధ్య రవాణా అంతరాయం ఏర్పడుతుందని, భద్రాచలంలోని విద్యాసంస్థల్లో చదివే గిరిజన విద్యార్థులకు రాకపోకల్లో , రెండు రాష్ట్రాల చెక్‌పోస్టులతో గిరిజనులు, వాణిజ్య వాహనాలకు ఇబ్బందులు కలుగుతున్నాని పేర్కొన్నారు. ఎల్‌డబ్ల్యూఈ ప్రభావిత ప్రాంతం కావడంతో శాంతి భద్రతల సమస్యలు కూడా ఏర్పడుతున్నాయని, భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం నిర్వహణకు కూడా ఇబ్బందులు కలుగుతున్నాయని, దేవస్థానం భూములు ఏపీ పరిధిలో ఉన్నాయని అన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు, ఆ గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపడం అత్యవసరమని మంత్రి లేఖలో ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 ప్రకారం తగిన చట్టపరమైన, పరిపాలనా చర్యలు తీసుకోవాలని కోరారు.

# జూడాల సమ్మె విరమణ

**ప్రభుత్వంతో వారు జరిపిన చర్చలు సఫలం**

**తమ సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలి**

**లేదంటే జూన్ 30 నుంచి ధర్నాకు దిగుతాం**



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ జూనియర్ డాక్టర్లు తమ సమ్మెను విరమించారు. ప్రభుత్వంతో వారు జరిపిన చర్చలు సఫలం అయిన నేపథ్యంలో సోమవారం నుంచి తలపెట్టిన సమ్మెను విరమిస్తున్నామని జూడాలు ప్రకటించారు. తమ సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని లేదంటే జూన్ 30 నుంచి ధర్నాకు దిగుతామని జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి నాలుగు రోజుల క్రితం సమ్మె నోటీసు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహజూడాలను ఆదివారం చర్చలకు ఆహ్వానించారు. చర్చలకు ముందే ప్రభుత్వం మెడికోలకు భారీగా స్టైఫండ్ పెంచుతూ ఉత్తర్వులు విడుదల చేసింది. అలాగే కాలేజీల్లో, అనుబంధ ఆసుపత్రుల్లో మౌలికసదూపాయాలు పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ క్రమంలో ప్రభుత్వంతో తమ చర్చలు సఫలం అయ్యాయని జూడాలు పేర్కొన్నారు.

# ఉక్రెయిన్ అమ్ముల పొదిలో 'చీమల దండు'!

**యుద్ధ కార్యకలాపాల్లో వినియోగించేందుకు మానవరహిత రోబో మురాఖా**

**యుద్ధక్షేత్రంలో కృత్రిమమేధతో పని చేసే డ్రోన్ వ్యవస్థను వినియోగిస్తున్న ఉక్రెయిన్**

**ఇప్పటివరకు యుద్ధరంగంలోకి 80కిపైగా రోబోలు**

**ఈ ఏడాది పూర్తయ్యేనాటికి 15,000 రోబోలను దించుతాం**

**ప్రకటించిన ఉక్రెయిన్ రక్షణశాఖ**

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** రష్యాతో అలుపెరుగని యుద్ధం చేస్తున్న ఉక్రెయిన్ తాజాగా.. మరో అస్త్రాన్ని తన అమ్ముల పొదిలో చేర్చింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన మురాఖా (చీమ) అనే చిన్నపాటి మానవరహిత రోబోను యుద్ధ కార్యకలాపాల్లో వినియోగించేందుకు ఆ దేశ రక్షణశాఖ అనుమతించింది. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో సైనికులకు సాయం చేసేందుకు వీటిని వినియోగించనున్నారు. శత్రు సైన్యం కాల్పులు జరిపేటప్పుడు, మందుపాతరలు ఉన్నట్లు అనుమానించిన ప్రాంతాల్లో వీటిని ముందువరుసలో నిలపనున్నారు. పరిమాణంలో చాలా చిన్నదిగా ఉన్నందున దీనికి 'చీమ' రోబో అని పేరుపెట్టారు. ఇది 500 కిలోల వరకు బరువును మోయగలదు. నిర్మాణ ఆకృతి కారణంగా శత్రు జామర్లకు కూడా దొరకదు. రష్యా అనుసరిస్తున్న అత్యాధునిక ఎలక్ట్రానిక్ యుద్ధ రీతులను సమర్థంగా ఎదుర్కొనేందుకు మానవ రహిత గ్రౌండ్ వెహికల్స్



(యూజీవీ)లను అభివృద్ధి చేసేందుకు ఉక్రెయిన్ ఎప్పటి నుంచో ప్రయత్నాలు మొదలుపెట్టింది. రిమోట్ కంట్రోల్ ద్వారా ఆపరేట్ చేస్తూ.. ప్రమాదకర పరిస్థితుల్లోనూ శత్రుసైన్యంతో పోరాడేందుకు ఉక్రెయిన్ వీటిని అభివృద్ధి చేసింది. ఈ రోబోను తొలిసారిగా జనవరి 2024లో ఆవిష్కరించారు. సుమారు 350 కిలోల బరువు ఉంటుంది. ఒకసారి ఛార్జింగ్ పెడితే 15కి.మీ వరకు ప్రయాణించ వచ్చు. అవసరం మేరకు ఇందులో ఒకట్రెండు లిథియం బ్యాటరీలను వినియోగిస్తారు. మరోవైపు ఇటీవలే 'డాడ్జర్' అనే మరో యూజీవీ రోబోను కూడా మిలిటరీలో వినియోగించేందుకు ఉక్రెయిన్ అనుమతిచ్చింది. ఇది 250 కిలోల వరకు బరువుల్ని మోయగలదు. మందుగుండు సామగ్రిని, యుద్ధ పరికరాలను కీలక ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా దీని నిర్మాణాన్ని చేపట్టారు. రష్యాతో దీర్ఘకాలంగా యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో 2024 నుంచి రోబోటిక్ పరికరాల అభివృద్ధిని ఉక్రెయిన్ వేగవంతం చేసింది. యుద్ధ క్షేత్రంలో ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు వీలుగా రిమోట్ ద్వారా పని చేసే మానవ రహిత గ్రౌండ్ వెహికల్స్‌ని ఉత్పత్తి చేస్తోంది. ఇప్పటికే కృత్రిమమేధతో పని చేసే డ్రోన్ వ్యవస్థను కూడా వినియోగిస్తోంది. ఇప్పటి వరకు 80కిపైగా రోబోలను యుద్ధరంగంలోకి దించింది. ఈ ఏడాది పూర్తయ్యేనాటికి 15,000 రోబోలను యుద్ధక్షేత్రంలోకి దించుతామని ఉక్రెయిన్ రక్షణశాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది.